కరీంనగర్‌కు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు

ఎల్కతుర్తి: బీఆర్‌ఎస్ మీటింగ్‌కు వెళ్తున్న నాయకులు

భీమదేవరపల్లి/ఎల్కతుర్తి, మార్చి 12 : కరీంనగర్‌లో మంగళవారం జరిగిన కదనభేరీ మహాసభకు బీఆర్‌ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. 'జై తెలంగాణ.. జై కేసీఆర్' అంటూ నినాదాలు చేశారు. ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో వాహనాల్లో వెళ్లారు. భీమదేవరపల్లి మండలం నుంచి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మారుపాటి మహేందర్‌రెడ్డి, ఎంపీపీ జక్కుల అనితా రమేశ్, జడ్పీటీసీ వంగ రవి, నాయకులు షరీఫోద్దీన్, శనిగరం సదానందం, బొల్లంపల్లి రమేశ్, కండె సుధాకర్, గద్ద సంపత్, వల్లెపు రమేశ్, ఎల్కతుర్తి మండలం నుంచి ఎంపీపీ మేకల స్వప్న, పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్, సొసైటీ చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, తంగెడ నగేశ్, ఎల్తూరి స్వామి, తంగెడ మహేందర్, కడారి రాజు, గొల్లె మహేందర్ ఉన్నారు.

'ముస్లింలను పట్టించుకోని రేవంత్ సర్కార్'

సమావేశంలో మాట్లాడుతున్న నయీమొద్దీన్

హనుమకొండ, మార్చి 12 : రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ ముస్లింలను పట్టించుకోవడం లేదని బీఆర్‌ఎస్ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు నయీమొద్దీన్ ఆరోపించారు. మంగళవారం బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రంజాన్ మాసం ప్రారంభమైనా మసీద్, ఈద్గాల వద్ద కనీస ఏర్పాట్లు కరువయ్యాయన్నారు. రంజాన్ పండుగకు ప్రత్యేక నిధులు కేటాయించలేదన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్నివర్గాల పండుగలను ఘనంగా నిర్వహించిందని గుర్తుచేశారు. ఆయా పండుగలకు దుస్తులు కూడా పంపిణీ చేసిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యాబినెట్‌లో ముస్లింలకు చోటు కల్పించడం లేదన్నారు. సమావేశంలో జిల్లా మైనార్టీ నాయకులు అఫ్జల్, సలీల్, హాజీద్, పులి రజినీకాంత్, పులి సారంగపాణి, రవీందర్‌రావు, శ్రీధర్, ఉపేందర్, కోటేశ్వర్ పాల్గొన్నారు.

'మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ'

సమావేశంలో మాట్లాడుతున్న ప్రశాంత్

హనుమకొండ చౌరస్తా, మార్చి 12 : ఎన్నికల సమయంలో 25వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వం ఇచ్చిన 6వేల పోస్టులకు మరో 5వేల పోస్టులు కలిపి 11వేలతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులను దగా చేసిందని బీఎస్‌ఎఫ్ కేయూ ఇన్‌చార్జి, పరిశోధక విద్యార్థి కల్లెపల్లి ప్రశాంత్ విమర్శించారు. మంగళవారం కేయూ లైబ్రరీ ప్రాంగణంలో నిరుద్యోగ విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురుకుల నియామకంలో రీలింక్విష్ మెంట్ పద్ధతిలో అవరోహణ క్రమంలో ఉద్యోగాలను భర్తీ చేయకుండా డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ పోస్టుల్లో అభ్యర్థులను ప్రభుత్వం తొందరపాటుగా నియమించిందని, దీనివల్ల 4వేల బ్యాక్‌లాగ్ పోస్టులు ఏర్పడి జేఎల్ పీజీటీ, టీజీటీ పోస్టులకు 1:2లో సెలెక్ట్ అయిన మెరిట్ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. అవరోహణ క్రమం పాటిస్తే ఒక్క బ్యాక్ లాగ్ పోస్టు కూడా మిగలకుండా నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందన్నారు. గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టులను పెంచాలని, కానిస్టేబుల్ ఉద్యోగార్థులకు నష్టం కలిగించే జీవో 46ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీఎస్‌ఎఫ్ కేయూ అధ్యక్షుడు శివకుమార్, పరిశోధక విద్యార్థులు గాజుల వెంకన్న, రాజేందర్, శివ, నవీన్, విష్ణు రాజేశ్, రమేశ్, సందీప్ పాల్గొన్నారు.

'బీజేపీ ఎంపీని బహిష్కరించాలి'


రాస్తారోకో చేస్తున్న సంఘం సభ్యులు

కాజీపేట, మార్చి 12 : భారత రాజ్యాంగాన్ని మార్చేస్తానన్న బీజేపీ ఎంపీ అనంత్‌కుమార్ హెగ్డేను వెంటనే ఆ పార్టీ నుంచి బహిష్కరించాలని తేజోమయి మాల కుల సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు మర్యాల కృష్ణ డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీ వ్యాఖ్యలను నిరసిస్తూ సంఘం ఆధ్వర్యంలో కాజీపేట చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బహుజనులు ఏకమై బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. సంఘం నాయకులు పప్పుల గోవర్ధన్, కొండ్ర నర్సింగరావు, తండమల్ల వేణు, మైలారం శంకర్, కాళేశ్వరపు వెంకటేశ్, శేఖర్, భద్రయ్య, రాజకుమార్, శ్రీకాంత్, వెంకటస్వామి, కుమారస్వామి, రాజేందర్, నర్సింగరావు పాల్గొన్నారు.

బీఎస్‌ఎఫ్ భీమ్‌దీక్ష పోస్టర్ల ఆవిష్కరణ

హనుమకొండ చౌరస్తా, మార్చి 12 : మహనీయుల జయంతుల సందర్భంగా పవిత్ర మాసంగా భావిస్తూ ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 14వ తేదీ వరకు భీమ్ దీక్ష తీసుకోనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో మొదటి గేట్ వద్ద ఆవిష్కరించారు. బీఎస్‌ఎఫ్ కేయూ ఇన్‌చార్జి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్ మాట్లాడుతూ ఈనెల 15 నుంచి ఏప్రిల్ 14 వరకు మహనీయులు కాన్షీరాం, పూలే, బాబుజగ్జీవన్ రాం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతులు ఉన్నాయని తెలిపారు. ఈ 30రోజులు యువత మద్యం, మాంసం, అబద్ధాలకు దూరంగా ఉంటూ దీక్ష కొనసాగిస్తారని తెలిపారు. మార్చి 15న నాగార్జునసాగర్‌లో దీక్ష మొదలవుతుందని, పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్వేరో స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎల్తురి సాయి, బహుజన నాయకులు మచ్చ పవన్, మందా కార్తీక్, సాయిగౌడ్, సాయి కోబ్లర్, శ్రీనాథ్, పృథ్వీరాజ్, శ్రవణ్ పాల్గొన్నారు.

17న రాష్ట్రస్థాయి భగవద్గీత పోటీలు

పోచమ్మమైదాన్, మార్చి 12: ములుగు రోడ్డులోని సప్తధామంలో ఈ నెల 17న రాష్ట్రస్థాయి భగవద్గీత పోటీలు నిర్వహించనున్నట్లు శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ త్రిపురునేని గోపీచంద్ తెలిపారు. ఈ మేరకు పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. అండర్-12 జూనియర్లుగా, 12 నుంచి 21 ఏళ్లలోపు వారిని సీనియర్లుగా భావించి రెండు విభాగాలకు వేర్వేరుగా బహుమతులు అందజేస్తామన్నారు. ప్రథమ రూ.5,116, ద్వితీయ రూ.3,116, తృతీయ బహుమతి రూ. 1,116 ఉంటుందన్నారు.

రేపు కొమ్మాల జాతర పార్కింగ్ టెండర్

గీసుగొండ, మార్చి 12 : ఈ నెల 14న కొమ్మాల జాతరలో పార్కింగ్ నిర్వహణకు గ్రామ పంచాయతీ టెండర్ నిర్వహిస్తున్నట్లు ఎంపీవో ప్రభాకర్ తెలిపారు. ఇందులో గ్రామానికి చెందిన వారే పాల్గొనాలని, బుధవారం గ్రామ పంచాయతీకి కార్యదర్శి వద్ద రూ.50వేలు డిపాజిట్ చేసి రశీదు పొందాలని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

రాయపర్తి, మార్చి 12: మండలంలోని పలువురు ఎంపీటీసీలు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. సన్నూరు, కేశవాపురం, కొండూరు, మైలారం, మహబూబ్‌నగర్‌కు చెందిన ఎంపీటీసీలు భూక్యా గోవిందనాయక్, బానోత్ స్వేత, చిర్ర ఉపేంద్ర, గాడిపల్లి వెంకన్న, చిక్కొండ రజిత బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

LOST PASSPORT
I, KAILASH PANDYA, S/O. PUKHRAJ PANDYA, Age: 51yrs., Occu: Business, R/o. H.No. 16-3-349, Fort Road, Railway gate, Warangal Dist., T.S., I have lost my Passport No. K2586468 on 05-03-2024 while travelling from my house to Shambunipet. In my bike, If found please cont.:
9849629992

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads Please Contact...
9182777552
HANAMKONDA 9182777563, 9182777618
WARANAGAL 9182777556, 9182777557
JAYASHANKAR BHUPALPALLY 9182777559
MULUGU 9182777135
MAHABUBABAD 9182777554
JANGAON 9182777565

ప్రజాపాలన సేవాకేంద్రం వద్ద పడిగాపులు

సంగం : కంప్యూటర్‌లో చూపుతున్న ఎర్రర్ మెసేజ్

ఖానాపురం : బారులు తీరిన దరఖాస్తుదారులు

సంగెం, మార్చి 12 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలు అర్హులకు అందకుండా పోతున్నాయి. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా కంప్యూటర్లలో ఎంట్రీ చేయలేదని పలువురు వాపోతున్నారు. అవసరమైన జిరాక్స్‌లతో దరఖాస్తు అందించినప్పటికీ కరెంట్ మీటర్, గ్యాస్ కనెక్షన్ వివరాలు కంప్యూటర్లలో చూపడం లేదని ఆగ్రహిస్తున్నారు. హడావుడిగా దరఖాస్తులు స్వీకరించి, ఆధార్ నంబర్లు తప్పుగా ఎంట్రీ చేయడం, కొన్ని అసలే ఎంట్రీ చేయకపోవడంతో లబ్ధి పొందలేకపోతున్నామని కొందరు చెబుతున్నారు. దరఖాస్తు చేసుకున్న తర్వాత ఇచ్చిన రశీదును సైతం చూపుతున్నారు. ఇప్పుడు మళ్లీ గ్యాస్ సబ్సిడీ కోసం సరైన వివరాలను కంప్యూటర్‌లో ఎంట్రీ చేయగా తీసుకోవడం లేదని పేర్కొంటున్నారు. మంగళవారం సంగెం మండల పరిషత్ కార్యాలయంలోని ప్రజాపాలన సేవాకేంద్రంలో లబ్ధిదారులు పడిగాపులు పడినప్పటికీ ఉపయోగం లేకుండాపోయింది. ఇప్పటికైనా తమను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

దరఖాస్తుదారుల బారులు

ఖానాపురం : గృహజ్యోతి పథకం అమలుకు నోచుకోని అర్హులు మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద బారులు తీరారు. గత నెలలో దరఖాస్తు చేసుకున్న వారికి ఫిబ్రవరి నెలలో 200లోపు యూనిట్లకు జీరో బిల్లు రావాల్సి ఉంది. అయితే, పథకం అమలులో లోటుపాట్ల వల్ల అర్హులకు సైతం బిల్లులు వచ్చాయి. దీంతో ప్రజలు విద్యుత్ అధికారులను కలిసి సమస్యను వినిపించారు. సాంకేతిక కారణాలతో జీరో బిల్లు అమలు కాలేదని, మార్చికి సంబంధించి జీరో బిల్లు అమలు కావాలంటే ఎంపీడీవో కార్యాలయంలో సరి చేసుకోవాలని సూచించారు. మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి ప్రజలు తరలివస్తుండడంతో కార్యాలయం కిక్కిరిసిపోతోంది.

అమెరికాలో కాజీపేట విద్యార్థి మృతి

వాటర్ బైక్ రేసింగ్ పోటీల్లో ప్రమాదం

వెంకటరమణ(ఫైల్)

కాజీపేట, మార్చి 12: కాజీపేట పట్టణానికి చెందిన విద్యార్థి పిట్టల వెంకటరమణ (27) అమెరికాలో నీటిలో బైక్ రేసింగ్‌లో పాల్గొని ప్రమాదవశాత్తు మృతిచెందాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటరమణ ఏడాదిన్నర క్రితం అమెరికాకు వెళ్లి ఇండియాన పోలీస్ అనే ప్రాంతంలో నివసిస్తున్నాడు. యూఎస్‌లోని ఇండియానా ఐయూపీయూఐ యూనివర్సిటీలో చదువుతున్నాడు. ఈ నెల 9న నీటిలో బైక్ రేసింగ్‌లో పాల్గొన్నాడు. ఈ క్రమంలో అడ్డుగా వచ్చిన మరో వాటర్ బైక్‌ను ఢీకొట్టడంతో ప్రమాదవశాత్తు తీవ్రగాయాలు కాగా అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి పిట్టల రాజగణేశ్ రైల్వేగార్డుగా పనిచేస్తున్నాడు. రాజగణేశ్‌కు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వెంకటరమణ మృతదేహం సోమవారం కాజీపేటకు రావచ్చని బంధువులు చెప్పారు.

యువకుడి ఆత్మహత్య


అజయ్(ఫైల్)

నెక్కొండ, మార్చి 12: యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వెంకటాపురంలో జరిగింది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఒర్రె అజయ్(26) పనీపాట లేకుండా ఇంటి వద్దే ఖాళీగా ఉంటున్నాడు. ఈక్రమంలో మానసికంగా కుంగిపోయిన అతడు సోమవారం రాత్రి క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన తల్లిదండ్రులు అతడిని దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జేసీబీ, ట్రాక్టర్ల పట్టివేత

ఐనవోలు, మార్చి 12 : అనుమతులు లేకుండా మట్టిని తవ్వుతున్న జేసీబీతోపాటు ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. వనమాలకనపర్తి శివారులో అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తున్నట్లు సమాచారం అందగా, మంగళవారం సోదాలు నిర్వహించి జేసీబీతోపాటు రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు చెప్పారు. అలాగే, ఆకేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించి ఓనర్లు, డ్రైవర్లపై కేసు నమోదు చేసిన్నట్లు ఎస్సై వెల్లడించారు.

అక్రమ వెంచర్ హద్దురాళ్ల తొలగింపు

దామెర, మార్చి 12: మండలంలోని ఓగులాపురంలోని ఓ అక్రమ వెంచర్ హద్దురాళ్లను తొలగించినట్లు ఎంపీవో రంగాచారి తెలిపారు. నాన్ లేఅవుట్ వెంచర్ యజమానులకు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో నిబంధనల మేరకు హద్దురాళ్లను డోజర్‌తో తొలగించినట్లు పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.


ప్రయాణికురాలికి బ్యాగు అప్పగిస్తున్న పోలీసులు

ప్రయాణికురాలి బ్యాగు అప్పగింత

నర్సంపేట, మార్చి 12 : ప్రయాణికురాలి నుంచి దొంగ కొట్టివేసిన బ్యాగును కండక్టర్, డ్రైవర్ అప్రమత్తమై పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నర్సంపేట డిపో ఆర్టీసీ బస్సు మంగళవారం ఉదయం హైదరాబాద్‌కు బయల్దేరింది. హనుమకొండ బస్టాండ్‌లోకి చేరుకోగా, మరికొంతమంది ప్రయాణికులు ఎక్కారు. బస్సులో సుమా రు 80 మందికి పైగా ఉన్నారు. అయితే, హనుమకొండకు చెందిన సునీత బ్యాగ్‌లో నగదు రూ. 50 వేలు, ఐదు తులాల బంగారం, మూడు తులాల వెండి, మూడు ఫోన్లు ఉన్నాయి. ఆ బ్యాగును గుర్తుతెలియని వ్యక్తి లాక్కెళ్లడంతో ఆమె కేకలు వేసింది. డ్రైవర్, కండక్టర్ అప్రమత్తమై బస్సును పక్కకు నిలిపి ప్రయాణికులను ఒక్కొక్కరిని కిందకు దింపుతూ తనిఖీ చేసినా బ్యాగు లభించలేదు. దొంగ బస్సులోని ఓ సీటు కింద బ్యాగ్‌ను వేసి పరారయ్యాడు. కండక్టర్ జానీపాషా గుర్తించి పోలీసుల సహాయంతో ప్రయాణికురాలికి బ్యాగును అందించారు.

సెల్ ఫోన్ అప్పగించిన పోలీసులు

శాయంపేట, మార్చి 12: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు వెతికి బాధితుడికి మంగళవారం అప్పగించారు. మండల కేంద్రానికి చెందిన మామిడి ప్రమోద్ 15 రోజుల క్రితం మాందారిపేట నుంచి బస్సులో వెళ్తూ సెల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. శాయంపేట పోలీస్ స్టేషన్‌లో సీఈఐఆర్‌లో వివరాలతో ఫిర్యాదు చేశాడు. ఐటీ కోర్ పోలీసులు ఫోన్‌ను ట్రేస్ చేసి పట్టుకున్నారు. ఈ మేరకు సెల్‌ఫోన్‌ను ఎస్సై దేవేందర్ బాధితుడికి అందజేశారు.

నెగ్గిన పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం

నర్సంపేట రూరల్, మార్చి 12 : నర్సంపేట పీఏసీఎస్ చైర్మన్‌పై పలువురు సొసైటీ డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాసం మంగళవారం నెగ్గింది. ఫలితాల ప్రకటనను నిలుపుదల చేసిన అధికారులు.. ఈ నెల 20 తర్వాత కోర్టు తీర్పు అనంతరం నూతన చైర్మన్ ఎన్నికను చేపట్టాలని సూచించారు. పీఏసీఎస్ చైర్మన్ మురాల మోహన్‌రెడ్డిపై అవిశ్వాసం పెట్టాలని కోరుతూ తొమ్మిది మంది డైరెక్టర్లు డీసీవో సంజీవరెడ్డికి నోటీసులు అందించారు. ఈ మేరకు సొసైటీ కార్యాలయంలో డీసీవో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి 13 మంది డైరెక్టర్లు . అవిశ్వాసానికి మద్దతుగా 9 మంది చేతులెత్తడంతో అవిశ్వాసం నెగ్గినట్లు అధికారులు ప్రకటించారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో నోడల్ అఫీసర్ తోట శ్రీనివాస్, సుమలత, సొసైటీ సీఈవో, సిబ్బంది పాల్గొన్నారు.

20 తర్వాత చైర్మన్‌ను ప్రకటిస్తామన్న అధికారులు

చైర్మన్‌ను చెప్పుతో కొట్టిన మహిళ

పీఏసీఎస్ చైర్మన్ మురాల మోహన్‌రెడ్డిని మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి బండారు మంజుల చెప్పుతో కొట్టింది. సొసైటీ కార్యాలయ ఆవరణలో మోహన్‌రెడ్డిపై అవిశ్వాస తతంగం పూర్తయిన తర్వాత అధికారులు వెళ్లిపోయారు. అనంతరం మంజులతోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు కార్యాలయంలోకి వెళ్లి చైర్మన్‌తో వాగ్వాదానికి దిగారు. ఆయన ఓపిగ్గా వారికి సమాధానం చెప్పి బయటకు వచ్చాడు. వెనకాలే వచ్చిన మంజుల తన చెప్పులతో చైర్మన్‌ను కొట్టింది. నివ్వరపోయిన చైర్మన్ మిన్నకుండిపోయాడు. పోలీసులు వెంటనే ఆయనను స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా.. రాజకీయ కక్షతోనే ఆమె ఇలా చేసిందని పలువురు చర్చించుకుంటున్నారు.

విద్యుత్ శాఖలో మహిళల పాత్ర అద్వితీయం

ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

హనుమకొండ సబర్బన్, మార్చి 12: విద్యుత్‌శాఖలో మహిళల పాత్ర అద్వితీయమని, ఆపరేషన్స్ విభాగంలో వారి సేవలు వెలకట్టలేమని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారతే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. ఇన్‌చార్జి డైరెక్టర్లు అశోక్‌కుమార్, సదర్‌లాల్, మోహన్‌రావు, తిరుపతిరెడ్డి, జీఎం అన్నపూర్ణ, మహిళా ఉద్యోగులు నాగరాణి, చైతన్య, స్వాతి, సునీత, గంగాజమున, కల్పన, లక్ష్మీ, మధుమతి, కవిత, మాధురి, శిరీష పాల్గొన్నారు.

కొమ్మాలలో టీచర్లకు సన్మానం

గీసుగొండ : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కొమ్మాల ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న మహిళా టీచర్లు సీతాదేవి, మాలతి, లలిత, శైలజ, రేణుక, భాగ్యను తోటి ఉపాధ్యాయులు సన్మానించారు. ఉపాధ్యాయులు రాము విశ్వేశ్వర్, రాజిరెడ్డి, కుమారస్వామి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

'పీఎం విశ్వకర్మ యోజన'ను సద్వినియోగం చేసుకోవాలి

హనుమకొండ, మార్చి 12: అర్హులందరూ పీఎం విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ పథకంపై వివిధ చేతి వృత్తులు, హస్త కళాకారులకు అవగాహన కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చేతి వృత్తిదారులకు, హస్త కళాకారులు ఆర్థికంగా ఎదగడానికి ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ హరిప్రసాద్ మాట్లాడుతూ ఈ పథకంతో 18 రకాల చేతివృత్తులు, హస్తకళాకారులు ప్రయోజనం పొందవచ్చన్నారు. ఎంఎస్ఎంఈ అధికారి శివరాం ప్రసాద్, ఎల్డీఎం శ్రీనివాస్, మెప్మా పీడీ భద్రునాయక్, బీసీ వెల్ఫేర్ డీడీ రామ్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకుల స్కూల్, కాలేజీల్లో ప్రవేశాలకు 31 వరకు గడువు

హనుమకొండ చౌరస్తా, మార్చి 12: తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ సొసైటీ (టీఎంఆర్ ఈఐఎస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హనుమకొండ జిల్లాలోని నాలుగు తెలంగాణ మైనార్టీస్ గురుకుల పాఠశాలల్లో (ఇంగ్లిష్ మీడియం), నాలుగు కాలేజీల్లో 2024-25 విద్యాసంవత్సరానికి ప్రవేశాలకు ఈనెల 31 వరకు గడువు పొడిగించినట్లు జిల్లా మైనార్టీస్ సంక్షేమాధికారి మీన శ్రీను తెలిపారు. 5వ తరగతి, 6, 7, 8 (మైనార్టీల బ్యాక్‌లాగ్ ఖాళీలు) తరగతుల్లో పాఠశాల, కాలేజీల్లో చేరే అర్హులైన విద్యార్థులు www.tmreis.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు వివరాలు నమోదు చేయాలని సూచించారు.

ఫాతిమామాత స్వరూపం ఊరేగింపు

న్యూశాయంపేట, మార్చి 12 : లోకరక్షకుడు ఏసుక్రీస్తు తల్లి ఫాతిమా మాత దీవెనలు, ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఓరుగల్లు మేత్రాసనం పీఠాధిపతి బిషప్ డాక్టర్ ఉడుముల బాల అన్నారు. ఫాతిమా మాత మహోత్సవాల్లో భాగంగా కాజీపేట ఫాతిమానగర్ కేథడ్రల్ చర్చి ప్రాంగణంలో మంగళవారం రెండో రోజు ఫాతిమా మాత స్వరూపాన్ని అలంకరించి ఊరేగించారు. చర్చి నుంచి మెయిన్ రోడ్, దర్గా రోడ్డు, శౌరినగర్ మీదుగా తిరిగి ఫాతిమానగర్ వరకు పోలీసులు బందోబస్తు మధ్య ఊరేగింపు సాగింది. రాత్రి దివ్య ప్రసాద ప్రదక్షిణ, ఆశీర్వాదం, స్వస్థత ప్రార్థనలు జరిగాయి.

17మంది ఎస్సైలు బదిలీ

సుబేదారి, మార్చి 12 : వరంగల్ కమిషనరేట్ పరిధిలో 17మంది ఎస్సైలను బదిలీ చేస్తూ సీపీ అంబర్ కిశోర్ ఝా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మామునూరులో పనిచేస్తున్న సీహెచ్ ప్రమోద్‌కుమార్ శాయంపేటకు బదిలీ కాగా, ఇక్కడ పనిచేస్తున్న దేవేందర్ కేయూసీకి బదిలీ అయ్యారు. అలాగే, వీఆర్‌లో ఉన్న రవీందర్ కేయూసీ, బీ వెంకన్న ఇంతేజార్‌గంజ్, వీ నవీన్‌కుమార్ కాజీపేట, కే శ్రవన్‌కుమార్ హనుమకొండ, ఎస్‌కే మహ్మద్ మిల్స్‌కాలనీ, విజయకుమార్, బీ ప్రవీణ్ నర్సంపేట, టీ శ్రీకాంత్ మామునూరు, సీహెచ్ పరుశురాములు హనుమకొండ, టీ లచ్చయ్య మట్టెవాడ, ఉమాకాంత్ కాజీపేట ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న నరసింహారావు ఎనుమాముల, మొగిలి కాజీపేటకు బదిలీ అయ్యారు.

రైల్వే మూడో లైన్, స్టాళ్లు ప్రారంభం

నెక్కొండ/హసన్‌పర్తి, మార్చి 12 : నెక్కొండ-చింతల్‌పల్లి రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే మూడో లైన్‌తోపాటు నెక్కొండ స్టేషన్‌లోని ఉత్పత్తి సముదాయాన్ని మంగళవారం ప్రారంభించారు. రైల్వే ఏడీఈఎన్ డోర్నకల్ రమేశ్‌బాబు, నెక్కొండ రైల్వేస్టేషన్ మాస్టర్ ఉమేశ్‌కుమార్ పాండే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీఐ చంద్రమోహన్, నెక్కొండ రైల్వే అవేర్‌నెస్ ఫోరం కమిటీ బాధ్యుడు గోరంట్ల వెంకటనారాయణ పాల్గొన్నారు. అనంతరం నెక్కొండలో మూడో లైన్ వైపు టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయాలని, రెండో లైన్ నుంచి మూడో లైన్‌కు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని, పోలీస్‌స్టేషన్ వైపు నుంచి మూడో లైన్‌కు ప్రయాణికులు చేరేలా ప్రవేశమార్గం ఏర్పాటు చేయాలని, అదనంగా పలు రైళ్లకు హాల్టింగ్ ఇప్పించాలని కోరుతూ ఏడీఈఎన్‌కు స్థానికులు వినతిపత్రం అందించారు. కాగా, కాజీపేట నుంచి బల్లార్షకు సుమారు రూ.2,063 కోట్లతో నిర్మించిన మూడో లైన్‌ను హసన్‌పర్తి రోడ్డు రైల్వేస్టేషన్ ఆవరణలో కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్‌లో కలిసి రైల్వే డివిజన్ ఇంజినీర్, మేనేజర్ కుమార గుప్తా ప్రారంభించారు. ఈ పనులు సుమారు 80 శాతం పూర్తయినట్లు చెప్పారు. కార్యక్రమంలో టెలికాం ఇంజినీర్ శ్రీనివాస్, ట్రేడ్ ఇంజినీర్ జీపీ సింగ్, నాయకులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత.. ముగ్గురి అరెస్ట్

సుబేదారి, మార్చి 12: హనుమకొండ పోలీసులు గంజాయి పట్టుకొని, ముగ్గురిని అరెస్ట్ చేసి, కారు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో నిందితుల అరెస్టును చూపిన హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ వై.సతీశ్ వివరాలు వెల్లడించారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ వద్ద సోమవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా కారులో హనుమకొండ హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన జన్ను మనోహర్, రేగొండ మండలం చిన్నకోడెపాకకు చెందిన చిన్నల సాయిచరణ్, హనుమకొండ వికాస్‌నగర్‌కు చెందిన కత్తుల శివశంకర్ 1,680 గ్రాముల గంజాయితో పట్టుబడ్డారు. ముగ్గురిని అరెస్ట్ చేసి, గంజాయి, కారు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


నగేశ్ (ఫైల్)

గీసుగొండ, మార్చి 12: గ్రేటర్ 16వ డివిజన్ నర్సంపేట ప్రధాన రహదారిలోని ధర్మారం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందగా, అతడి తల్లికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. సంగెం మండలం కృష్ణానగర్‌కు చెందిన ఇమ్మడి నగేశ్(29) తన తల్లి పద్మను బైక్‌పై తీసుకొని హసన్‌పర్తి మండలం కేశవాపూర్‌లోని మరదలి పెళ్లి సందర్భంగా కూరాళ్లు పట్టేందుకు వెళ్తున్నాడు. ధర్మారం వద్ద బైక్‌ను వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో నగేశ్ అక్కడే మృతిచెందగా, అతడి తల్లికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం అంబులెన్స్‌లో ఎంజీఎం దవాఖానకు తరలించారు. గీసుగొండ ఎస్సై వెంకన్న చేరుకొని మృతదేహాన్ని ఎంజీఎం తరలించారు.

బాధితులకు ఎర్రబెల్లి పరామర్శ

పీర్యానాయక్‌ను పరామర్శిస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి, మార్చి 12: అవుసులకుంటతండాకు చెందిన రేషన్ డీలర్ పీర్యానాయక్ హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మంగళవారం దవాఖానకు చేరుకుని పీర్యానాయక్‌ను పరామర్శించారు. డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు.

'మైనింగ్ పనులను నిలిపివేయాలి'

రాయపర్తి, మార్చి 12 : ఆరెగూడెం, కొలన్‌పల్లి, కేశవాపురం, జింకురాంతండా పంచాయతీల పరిధిలోని పెద్దగుట్టపై నిర్వహిస్తున్న అక్రమ మైనింగ్ పనులను వెంటనే నిలిపివేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహానాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన పార్టీ నేతలతో కలిసి మంగళవారం తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జడ్పీటీసీ రంగు కుమార్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ బిల్లా సుధీర్‌రెడ్డి, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ ఆకుల సురేందర్‌రావు, నాయకులు గారె నర్సయ్య, నయీం, పూస మధు పాల్గొన్నారు.

పెద్దగుట్టను పరిశీలించిన అధికారులు

పెద్దగుట్టను పరిశీలిస్తున్న అధికారులు

రాయపర్తి, మార్చి 12 : కొలన్‌పల్లి, ఆరెగూడెం, కేశవాపురం, జింకురాంతండా పరిధిలోని పెద్దగుట్టను తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్ సారథ్యంలో జిల్లా గనులు, భూగర్భ జలవనరుల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారుల బృందం మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పెద్దగుట్టపై కాంట్రాక్టర్లు నిబంధనలను అతిక్రమించి తవ్వకాలు చేపట్టారని పేర్కొంటూ పెద్దగుట్ట పర్యావరణ పరిరక్షణ సమితి ప్రతినిధులు చిలుముల్ల కృష్ణ, జక్కుల రాజ్‌యాదవ్, కుసుమ రవిచందర్, హరీశ్ ఇటీవల కలెక్టర్ ప్రావీణ్యను కలిసి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఆమె ఆదేశాల మేరకు జిల్లా గనులు, భూగర్భ జలవనరుల శాఖ ఏడీ బీ రవీందర్, ఆర్ఐ జే మధుసూదన్, కాలుష్య నియంత్రణ మండలి ఏఈ సుభాష్, గిర్దావర్ కొయ్యాడ చంద్రమోహన్, సర్వేయర్ వీరస్వామితో కలిసి పెద్దగుట్టను పరిశీలించామన్నారు. గ్రామస్తుల అభిప్రాయాలను నివేదికల రూపంలో కలెక్టర్‌కు అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు వాసం సారంగం, సుధాకర్, ప్రదీప్, సురేశ్, రాజేశ్వర్‌రావు, భాస్కర్, భిక్షపతి, సంతోష్ కుమార్, బల్లకారి యాకయ్య పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

పర్వతగిరి, మార్చి 12: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 96 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు చెక్కులు పంపిణీ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సింగులాల్, ఎంపీపీ కమల పంతులు, తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీవో శంకర్, ఎంపీటీసీలు మాడుగుల రాజు, బొట్ల మహేంద్ర పాల్గొన్నారు.

జాతీయ క్రీడల్లో ఎంజేపీ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న టీచర్లు

వర్ధన్నపేట, మార్చి 12: ఈ నెల 10, 11న మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగిన జాతీయ స్థాయి జూనియర్స్ ఫుడ్‌బాల్ పోటీల్లో మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులం విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా మంగళవారం కోచ్ బాలబోయిన సందీప్ మాట్లాడుతూ మహారాష్ట్రలో జరిగిన పోటీల్లో ఎంజేపీఎస్‌లో చదువుతున్న పలువురు విద్యార్థులు పాల్గొని విశేష ప్రతిభ కనబర్చారని తెలిపారు. బీ హరీశ్ సింగిల్‌స్టోక్‌లో బంగారు పతకం, శ్రీతేజ, అరుణ్‌తేజ్ డబుల్స్‌లో సిల్వర్ మెడల్స్ సాధించగా, లోకేశ్, గణేశ్, విష్ణేశ్, సహర్ష్, హరీశ్, శ్రీతేజ రజత పతకాలు సాధించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

'కార్మికుల పనివేళల్లో మార్పు చేయాలి'

వరంగల్, మార్చి 12 : వేసవిలో ఎండలు మండుతున్నందున గ్రేటర్ పరిధిలో పారిశుధ్య కార్మికుల పని వేళల్లో మార్పు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. మంగళవారం కార్పొరేషన్‌లో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్‌కు కార్మిక సంఘాల నేతలు వినతి పత్రం అందజేశాయి. ప్రస్తుతం రెండు పూటల పనివేళలు ఉండడంతో ఎండ తీవ్రతకు కార్మికులు అస్వస్థతకు గురవుతున్నారని పేర్కొన్నారు. వేసవిలో కార్మికులకు ఉదయం 5 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పనివేళలు నిర్ణయించాలని కోరారు. సీఐటీయూ నాయకులు సింగారపు బాబు, జన్ను ప్రకాశ్, సుమన్, కుమారస్వామి ఉన్నారు.

ఆర్ట్స్ కాలేజీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


1971-74 బ్యాచ్ డిగ్రీ విద్యార్థులు

హనుమకొండ, మార్చి 12: హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 1971-74 మధ్య డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థుల సమ్మేళనం మంగళవారం కళాశాలలో జరిగింది. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి అధ్యక్షత వహించగా పూర్వ విద్యార్థి రామ్‌రెడ్డి మాట్లాడారు. వీరసేనరెడ్డి, తిరుపతి, సుధాకర్, రామ్మూర్తి వందమంది పూర్వ విద్యార్థులు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్ల రమేశ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట ఏది..?

చోద్యం చూస్తున్న అధికారులు

అనుమతి లేకుండా నల్లబెల్లిలో నిర్మిస్తున్న భవనం

నల్లబెల్లి, మార్చి 12 : మండలంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అడ్డుకట్ట వేయడంలో అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలకేంద్రంలో కొంతమంది గ్రామ పంచాయతీ అనుమతి లేకుండానే యథేచ్ఛగా జీ ప్లస్ టు వరకు అక్రమంగా భవనాలు నిర్మిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధాన రోడ్డుకు ఇరువైపులా నిబంధనలకు విరుద్ధంగా ఇండ్ల నిర్మాణాలు చేస్తున్నట్లు తెలుస్తున్నది. అలాగే, మండలంలోని శనిగరం, నల్లబెల్లి గ్రామాల పరిధిలో అనేక అసైన్డ్ భూములు ఉన్నాయి. వీటిని ప్రభుత్వ స్థలాలుగా రెవెన్యూ అధికారులు గుర్తించినప్పటికీ హద్దులు ఏర్పాటు చేయకపోవడం వల్ల క్రయవిక్రయాలు కొనసాగుతూ భవన నిర్మాణాలు జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదంతా జరుగుతున్నా రెవెన్యూ, జీపీ అధికారులు చోద్యం చూడడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ రాజేశ్‌ను వివరణ కోరగా.. అనుమతిలేకుండా భవన నిర్మాణాలు చేపట్టినా, అసైన్డ్ భూముల్లో క్రయవిక్రయాలు చేపట్టి ఇండ్లు నిర్మించినా భవనాలను కూల్చి వేస్తామని తెలిపారు.